

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో తాళ్ తరంగ్ నర్తకీమణులు గోపిక మోహన్, ఆర్ద్ర స్వాదన, అస్వతే, అపర్ణలు భరతనాట్య నృత్య ప్రదర్శనలిచ్చారు.

– కొండాపూర్


నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 3 నవంబర్ 2024 | HYDERABAD


# అరుణాచల గిరి ప్రదక్షిణ.. పంచారామాలకు ప్రత్యేక బస్సులు



సుల్తాన్‌బజార్, నవంబర్ 2: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అరుణాచల గిరి ప్రదక్షిణ, పంచారామాల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీలత శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 13న ఎంజీబీఎస్, బీహెచ్‌ఈఎల్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయని ఆమె వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా కాణిపాకం, వెల్లూరులోని శ్రీ నారాయణి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం 16న తిరిగి ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌కు చేరుకుంటాయని చెప్పారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ స్పెషల్ బస్సుల టికెట్ బుకింగ్ కోసం www.tgsrtconline.in లో లేదా టీజీఎస్ఆర్‌టీసీ అన్ని కౌంటర్‌లలో బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 13న పటాన్‌చెరూ, రామచంద్రాపురం, బీహెచ్‌ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, ఎంజీబీఎస్, జేబీఎస్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. అరుణాచలం వెళ్లే భక్తులు బీహెచ్‌ఈఎల్ నుంచి సూపర్ లగ్జరీ రూ. 4000, రాజధాని రూ. 5360, ఎంజీబీఎస్ నుంచి సూపర్ లగ్జరీ రూ. 3900, రాజధాని రూ. 5230 టికెట్ చార్జీలను నిర్ణయించినట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 9959226149, 9959226153, 9959226249, 9959226250 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అంతేకాకుండా ఈ నెల 3న ప్రతి ఆదివారం పంచారామాల ప్రత్యేక ప్యాకేజీని మియాపూర్ డిపో–1 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ నెల 3న, 10న, 17న, 24వ తేదీల్లో పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శివాలయాలకు ప్రతి సోమవారం రాత్రి పది గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి మియాపూర్ డిపో–1కు బస్సులు చేరుకుంటాయన్నారు.

# స్కిల్ వర్సిటీ వరకు మెట్రో

**24,269** కోట్లు **76.4** కి.మీలు

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మెట్రో 2.0

### ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు

### జీవో నంబర్ 196 జారీ

సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో రెండో దశ మెట్రో ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్నామని తెలంగాణ సర్కారు వెల్లడించింది. దీనికి సంబంధించి రాష్ట్ర పురపాలక శాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పరిపాలనా అనుమతులు ఇస్తున్నట్లు జీవో ఎంఎస్. నంబర్ 196ను శనివారం జారీ చేసింది. నగరం విస్తరిస్తున్న కొద్దీ ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ఇప్పుడున్న మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించిన డీపీఆర్‌లను వారం రోజుల కిందటే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రెండో దశలో 5 మార్గాల్లో మొత్తం 76.4 కి.మీ మేర నిర్మించే ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ. 24,269 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అందులో 30 శాతం రూ. 7313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. అదేవిధంగా జైకా, ఏబీడీ,ఎన్‌డీబీ సంస్థల నుంచి 48 శాతం చొప్పున అప్పుగా రూ.11,693 కోట్లు, మిగతా 4 శాతమైన రూ.1033 కోట్లను పీపీపీ విధానంలో వెచ్చించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చాయి.

### మొదటి దశకు విశేష ఆదరణ

మెట్రో మొదటి దశకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ ఉందని, ప్రతి రోజూ 5లక్షలకు పైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని ప్రభుత్వం పేర్కొంది. మొదటి దశకు అనుసంధానంగా మరో 6 కారిడార్లను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొదటి దశ మెట్రోను పూర్తిగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో రూ. 22వేల కోట్ల వ్యయంతో నిర్మించగా, ఇది ప్రపంచంలో అతి పెద్ద పీపీపీ మెట్రో ప్రాజెక్టుగా నిలిచింది. నగరంలో వాయు కాలుష్యం నివారించడంతో పాటు అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థగా మెట్రో రైలు అవసరమని గుర్తించి రెండోదశను మొత్తం 116.4 కి.మీ మేర నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పార్ట్–ఏలో 76.4 కి.మీ, పార్ట్–బీలో 40 కి.మీ దూరంతో రెండో దశ నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వెళ్లనున్నదని జీవోలో పేర్కొన్నారు.


### రెండో దశలో నిర్మించే మెట్రో మార్గాలు..

- కారిడార్–4: నాగోల్–శంషాబాద్ ఎయిర్‌పోర్టు 36.8 కి.మీ. (ఎయిర్‌పోర్టు కారిడార్)
- కారిడార్–5: రాయదుర్గం–కోకాపేట నియోపోలిస్–11.6 కి.మీ
- కారిడార్–6: ఎంజీబీఎస్– చాంద్రాయణగుట్ట– 7.5 కి.మీ( ఓల్డ్ సిటీ కారిడార్)
- కారిడార్–7: మియాపూర్– పటాన్‌చెరు – 13.4 కి.మీ
- కారిడార్–8: ఎల్బీనగర్ – హయత్‌నగర్ – 7.1 కి.మీ
- కారిడార్–9: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ
- రెండో దశ పార్ట్–ఏలో నిర్మించే మొత్తం దూరం 76.4 కి.మీ
- రెండో దశ పార్ట్–బీలో నిర్మించే మొత్తం 40 కి.మీతో కలిపి మొత్తం మెట్రో రెండో దశ కారిడార్ల దూరం 116.4 కి.మీ.

### కారిడార్-9గా ఫోర్త్ సిటీ మెట్రో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకటించిన ఫోర్త్ సిటీకి మెట్రో కారిడార్ నిర్మాణానికి హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రతిపాదనలు రూపొందిస్తున్నది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఓఆర్ఆర్ మీదుగా కొంగరకలాన్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ దూరంతో నిర్మించేందుకు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. కారిడార్–9గా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీ మెట్రో మార్గానికి సైతం ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించి అలైన్‌మెంట్, ఇతర ఫీచర్లు, ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపై మెట్రో అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారని జీవోలో పేర్కొన్నారు.





## పెట్టుబడి డబుల్ అవుతుందంటే..

బంజారాహిల్స్, నవంబర్ 2: ఆన్‌లైన్‌లో వచ్చిన ఓ లింక్ ద్వారా పెట్టుబడి డబుల్ అవుతుందని నమ్మి ఓ వ్యక్తి డబ్బులు చెల్లించి మోసపోయాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రోడ్ నం. 5లోని దేవరకొండ బస్తీలో ఉంటున్న పవన్ కుమార్ అనే కాంట్రాక్టర్‌కు రెండునెలల కిందట వాట్సాప్‌లో గుర్తు తెలియని నంబర్ నుంచి ఒక లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగానే సర్వర్ అనే ప్రొడక్ట్‌ను కొంటే పెట్టిన పెట్టుబడి డబుల్ అవుతుందని మెసేజ్ వచ్చింది. నమ్మిన పవన్‌కుమార్ రూ. 18500 పెట్టాడు. మరో పదిరోజుల తర్వాత మరో రూ. 12300 చెల్లించాడు. అయితే రోజులు గడిచినా పెట్టుబడి డబుల్ కాకపోవడంతో పాటు తన వ్యాలెట్‌లో కనిపించిన డబ్బులు కూడా బ్లాక్ అవ్వడంతో మోసపోయినట్లు గుర్తించిన పవన్ కుమార్ శనివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఓటీఎస్ గడువు 30 వరకు..

సిటీబ్యూరో, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): ఓటీఎస్ 2024 గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పథకం గడువును పెంచాలని వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు రావడంతో జలమండలి ప్రభుత్వానికి లేఖ రాసిందని ఈ మేరకు ఓటీఎస్ గడువును ప్రభుత్వం మరోసారి పెంచిందని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జలమండలిలో ఓటీఎస్ 2024 పథకం ద్వారా అక్టోబర్ 31 వరకు రూ.49 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సమయంలో దాదాపు 70,335 మంది వినియోగదారులు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. నగరంలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన నల్లాకనెక్షన్ బిల్లులను వసూలు చేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

# ప్రభుత్వ స్థలం.. ప్రైవేటు భూమిగా..

### ఇద్దరు వ్యక్తుల నుంచి రూ. 2 కోట్లు వసూలు... నిందితుడి అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని ప్రైవేటు స్థలంగా చిత్రీకరించి ఇద్దరు వేర్వేరు వ్యక్తులకు విక్రయించే క్రమంలో రూ.2 కోట్లు వసూలు చేసిన ఘరానా మోసగాడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ కథనం ప్రకారం...మేడ్చల్ జిల్లా, సూరారం ప్రాంతానికి చెందిన ఎన్‌వీవీ సుబ్రహ్మణ్యం సూరారం కాలనీలోని నిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతీ పీఠంలో పూజారి. అయితే మెదక్ జిల్లా, శివంపేట మండలంలో ఓ ఖాళీ స్థలం కొని అక్కడ దేవాలయాన్ని నిర్మించాలని భావించి, అనువైన ఖాళీ స్థలం కోసం అన్వేషిస్తుండగా, 2018లో శివంపేట తహసీల్దార్ కార్యాలయంలో మెదక్ జిల్లా, శివంపేట మండలం, రత్నాపూర్ గ్రామానికి చెందిన ఉదండపురం నర్సింహులు పరిచయమయ్యాడు. తాను తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగినని, త్వరలో తనకు డిప్యూటీ తహసీల్దార్ పదోన్నతి రానున్నట్లు నర్సింహులు నమ్మబలికాడు. దీంతో పూజారి సుబ్రహ్మణ్యం తాను స్థానికంగా ఒక దేవాలయ నిర్మాణానికి యోచిస్తున్నానని, అందు కోసం అనువైన ఖాళీ స్థలం కోసం వెతుకుతున్నట్లు వివరించాడు. దీంతో తాను దేవాలయం నిర్మాణానికి అనువైన స్థలాన్ని చూపిస్తానని చెప్పి.. శివంపేట మండలంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పూజారికి చూపించాడు. ఆ స్థలానికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి.. బాధితుడికి చూపించాడు. బాధితుడు నుంచి అడ్వాన్స్‌గా రూ.1.20 కోట్లు తీసుకున్నాడు. అదే తరహాలో మరో బాధితుడు ఆలేటి కుమార్ వద్ద నుంచి కూడా రూ.50 లక్షలు వసూలు చేశాడు. కానీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించకుండా కాలయాపన చేస్తుండడంతో అనుమానం వచ్చిన బాధితులు.. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడు నర్సింహులును అరెస్టు చేశారు.

## గ్రేటర్ @31.5 డిగ్రీలు



సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఆవర్తన ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. శనివారం రాత్రి 10 గంటల వరకు మియాపూర్‌లో అత్యధికంగా 1.03 సెం.మీలు, అల్వాల్‌లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.5, కనిష్ఠం 22.6 డిగ్రీలు, గాలిలో తేమ 66శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# ఇండ్లపై హైటెన్షన్ తీగలు పడి..

## పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు ..ఉలిక్కిపడ్డ ఎల్లారెడ్డిగూడ

### సర్కారు బడి, గృహాలపై పడిన కరెంటు వైర్లు

### ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రార్థన చేస్తుండగా ఘటన

### భయంతో పరుగులు పెట్టిన ప్రజలు

### శ్రీనగర్‌కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన స్థానికులు



ఎల్లారెడ్డిగూడ వాసుల నిరసనకు మద్దతు తెలుపుతున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్ యాదవ్

> **హైటెన్షన్ విద్యుత్ తీగలను భూగర్భం నుంచి వేయాలి:**
>
> కార్పొరేటర్ సంగీతా శ్రీనివాస్‌యాదవ్
>
> ప్రమాదభరితంగా మారిన హైటెన్షన్ విద్యుత్ తీగలను ఇండ్లు, బడి వద్ద నుంచి తొలగించి..ఈ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ కరెంటు కేబుళ్ల పనులను అధికారులు వెంటనే చేపట్టాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్‌యాదవ్ కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ముమ్ముందు ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలను రక్షించేందుకు హైటెన్షన్ కరెంటు తీగలను భూగర్భం నుంచి వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వెంగళరావునగర్, నవంబర్ 2 :సర్కార్ బడిపై, ఇండ్లపై హైటెన్షన్ విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగిపడ్డాయి. పెద్ద శబ్ధంతో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. 8 గంటల సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగి సర్కారు బడి భవనం, స్థానికుల ఇండ్లపై పడిపోవడంతో సర్కారు బడి, ఇండ్లల్లో నుంచి ఆర్తనాదాలు చేస్తూ జనం బయటకు పరుగులు తీశారు. సోమాజిగూడలోని ఎల్లారెడ్డిగూడ వడ్డెర బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉదయం ప్రార్థన చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గతంలో ఎత్తరి మనీలా అనే మహిళ హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ శాఖాధికారుల్లో చలనం లేకపోవడంతో ఆగ్రహించిన మహిళలు, స్థానికులంతా కలిసి శ్రీనగర్‌కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన నిర్వహించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



### ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో పనులు


ఇప్పటికే ఈ లైన్ తొలగింపునకు సిఫార్సు చేశామని, ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉన్నదని, త్వరితగతిన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఏడీఈ ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానికులకు భరోసా ఇచ్చారు. పంజాగుట్ట, రహ్మత్‌నగర్ లో సైతం విద్యుత్ సరఫరా లోపాలతో హైటెన్షన్ తీగలు తెగాయని వీటికి మరమ్మతులు చేస్తున్నామని,శాశ్వత పరిష్కారాలను చేపడతామని చెప్పారు.



శ్రీనగర్ కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ బయట నిరసన తెలుపుతున్న ఎల్లారెడ్డిగూడ వాసులు

### సబ్ స్టేషన్‌ను ముట్టడించిన జనం

విద్యుత్ శాఖ నిర్లక్ష్య వైఖరితో తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని ..తక్షణమే సర్కారు బడి, ఇండ్లపై ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలను తొలగించాలని డిమాండ్ చేస్తూ మహిళలు, స్థానికులంతా శ్రీనగర్‌కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట గతేడాది మరణించిన ఎత్తరి మనీలా చిత్రపటాన్ని కార్యాలయం గోడకు అతికించి ఆందోళన నిర్వహించారు. సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్‌యాదవ్,వడ్డెర బస్తీ ప్రెసిడెంట్ లక్ష్మణ్, కార్యదర్శి వేణు, స్థానిక ఎంఐఎం నాయకుడు ఎర్ర నగేశ్ అక్కడికి చేరుకుని స్థానికులకు మద్దతు పలికారు. ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలని కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్‌యాదవ్ సూచించగా, వెంటనే అధికారులు కరెంటు సరఫరాను నిలిపివేశారు.



# సర్వే పూర్తయిన చెరువుల పరిశీలన

### ప్రణాళిక సిద్ధం చేసుకున్న హైడ్రా

మేడ్చల్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): సర్వే పూర్తయిన చెరువులను త్వరలోనే పరిశీలించేందుకు హైడ్రా అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలల్లో మొత్తం 620 చెరువులు ఉండగా వీటిలో 97 చెరువులకు సంబంధించి సర్వే పూర్తి చేసి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల హద్దులను గుర్తించారు. గుర్తించిన చెరువుల వివరాలను ఇటీవలే హైడ్రా అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. దీంతో మొదటి విడతలో జిల్లాలో 97 చెరువులను పరిశీలించేలా ప్రణాళికలను సిద్ధం చేసినట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దుల లోపు ఉండే నిర్మాణాలు, లే అవుట్ల లెక్క తేల్చేందుకే హైడ్రా అధికారులు చెరువులను పరిశీలించనున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటికే చెరువుల సమీపంలో ఉన్న నిర్మాణాలు, లే అవుట్ల వివరాలను రెవెన్యూ అధికారులు గుర్తించి, ప్రభుత్వానికి నివేదికలను సమర్పించినట్లు అధికారుల ద్వారా తెలిసింది. హైడ్రా అధికారులు చెరువుల పరిశీలన చేయనున్నట్లు తెలుసుకున్న చెరువుల సమీపంలో నిర్మించుకున్న నిర్మాణాల యజమానులు ఆందోళనకు గురువుతున్నారు.

### మరో 110 చెరువులు..

జిల్లాలోని మరో 110 చెరువుల సర్వే పూర్తి చేసి హద్దులను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలను సమర్పించారు. ప్రభుత్వం 110 చెరువుల హద్దుల నిర్ణయంపై నోటిఫై చేసిన అనంతరం హైడ్రా అధికారులకు అందించనున్నారు. తదుపరి హైడ్రా అధికారులు రెండో విడతలో హద్దులు గుర్తించిన చెరువులను పరిశీలించేందుకు సిద్ధం కానున్నారు. మిగతా 413 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దులను గుర్తించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు డీజీపీఎస్ యంత్రాల సాయంతో సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, జిల్లాలోని అనేక చెరువుల సమీపంలో వందలాది సంఖ్యలో లే అవుట్లు ఉన్న క్రమంలో ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.